# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 24-05-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ఎబోలా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో రాష్ట్రంలో ముందస్తు చర్యలు చేపట్టామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.
- ❖ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.
- ❖ పేదల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు.
- ❖ రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధి చెందాలని ప్రముఖ సినీ నటుడు, హిందూపురం శాసన సభ్యులు నందమూరి బాలకృష్ణ కోరారు.

====================

ఆఫ్రికా ఖండంలోని పలు దేశాల్లో ఎబోలా వైరస్ వ్యాప్తితో పాటు.. కేసులు, మరణాల నమోదు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలో అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈరోజు విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యంగా కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాల్లో ఏబోలా వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉందని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ జారీ చేసిన హెచ్చరికలు, కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ప్రభుత్వాలకు వస్తున్న ప్రత్యేక మార్గదర్శకాల ఆధారంగా `ఎబోలా` వైరస్ ను సమర్థంగా ఎదుర్కొనేందుకు వైద్య, ఆరోగ్య శాఖ సిద్దంగా ఉందని మంత్రి చెప్పారు. రాష్ట్రంలోని విశాఖపట్టణం, తిరుపతి, విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయాల ద్వారా వచ్చే ప్రయాణికులు, పర్యాటకులకు ఎబోలా వైరస్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామని అన్నారు. వైరస్ లక్షణాలు కలిగిన వారిని క్వారంటైన్ చేసి.. పక్కనున్న వారికి కూడా వైద్య పరీక్షలు చేస్తామని సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

====================

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. తిరుపతిలోని అలిపిరి పాదాల మండపం నుంచి తిరుమలకు కాలినడకన కేంద్రమంత్రి ఈరోజు చేరుకున్నారు. ఈ సందర్భంగా  పాత్రికేయులతో మాట్లాడుతూ... కాలినడక దారిలో భక్తుల కోసం టీటీడీ  చేసిన ఏర్పాట్లు సంతృప్తి కరంగా ఉన్నాయని అన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 23 సెకన్లు)

====================

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా తూర్పు నియోజకవర్గ పరిధిలో ఈ రోజు జరిగిన ఒక కార్యక్రమంలో  ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 87 లక్షల రూపాయల విలువైన చెక్కులను స్థానిక శాసన సభ్యుడు గద్దె రామ్మోహన్ తో కలసి 63 మంది లబ్ధిదారులకు మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్రంలోని ఏ ఒక్కరూ అనారోగ్యంతో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందచేస్తోందని పేర్కొన్నారు.

విరామం

====================

రాష్ట్రంలో చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధి చెందాలని ప్రముఖ సినీ నటుడు, హిందూపురం శాసన సభ్యులు నందమూరి బాలకృష్ణ ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, దూరదర్శన్ నాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా పి. భరత్ భూషణ్ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని విజయవాడలో ఈరోజు నిర్వహించారు. ముఖ్య అతిధిగా హాజరైన నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో సినిమా షూటింగ్‌లకు మంచి ప్రదేశాలు ఎన్నో ఉన్నాయని చెప్పారు. ఆయా ప్రాంతాలలో మౌలిక సదుపాయల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని వెల్లడించారు.

====================

పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ తన జీవిత ప్రస్థానాన్ని తెలియచేస్తూ.. రచించిన 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకాన్ని ఒడిశా రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబు ఆవిష్కరించారు. విశాఖపట్నంలో ఈరోజు జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న హరిబాబు ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రజల మధ్య నుంచి ఎదిగి గవర్నర్ పదవి వరకు చేరుకున్న దత్తాత్రేయ జీవిత ప్రయాణం యువతకు ఆదర్శప్రాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రాజ్యసభ మాజీ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

====================

రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రధాన నగరాల్లో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలు ఈరోజు ప్రశాతంగా జరిగాయి. విశాఖపట్టణంలో పెద్ద సంఖ్యలో అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, సంయుక్త కలెక్టర్ జి. విద్యాధిరి పరీక్షా కేంద్రాలను సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు. అదే విధంగా తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ స్థానిక యూపీఎస్సీ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

====================

కోస్తాంధ్రప్రదేశ్, రాయలసీమ జిల్లాలలో కొన్ని చోట్ల ఉరుములతో కూడిన వర్షం ఈరోజు పడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. రాయలసీమలోని పలు చోట్ల గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు తెలిపారు. అదే విధంగా రేపు

కోస్తాంధ్రప్రదేశ్, రాయలసీమ జిల్లాలలో అక్కడక్కడ ఉరుములతో కూడిన వర్షం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా రాష్ట్రంలో 17 జిల్లాల్లో తీవ్ర వడగాలులతో వేడి వాతావరణం నెల కొని ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. 44 డిగ్రీ సెల్సియస్ వరకూ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

====================

జనగణన గృహ జాబితా లెక్కింపు కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. భీమవరంలోని దుర్గాపురం ప్రాంతంలో జనగణన కార్యక్రమాన్ని కలెక్టర్ ఈరోజు పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి సేకరిస్తున్న వివరాలు, నమోదు విధానం, ప్రజల స్పందన తదితర అంశాలను స్వయంగా పర్యవేక్షించారు. గృహాల వివరాలు నమోదు చేసే సమయంలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

====================

====================